గురజాడకు ఘన నివాళి



గురజాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

సాహితీ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి కలెక్టర్ విజయకృష్ణన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.దయానిధి, ఏవో శ్రీనివాసరావు, డీఎల్‌డీవో మంజులావాణి, డీపీవో శిరీషా, తదితరులు పాల్గొన్నారు. - అనకాపల్లి టౌన్

మొక్కజొన్న సాగుకు మంచి రోజులు

సాగుకు సర్కారు ఊతం

- ఇథనాల్ ప్రాజెక్టు డిస్టిలరీలకు చెరకుతో పాటు ప్రత్యామ్నాయ ముడి సరకుగా మొక్కజొన్న



మొక్కజొన్న తోట



మొక్కజొన్న పొత్తులు

చోడవరం, సెప్టెంబరు 21: **మొక్కజొన్న సాగుకు మంచిరోజులు రానున్నాయి. వరి, చెరకు పంటలకు పెట్టుబడితో ఆదాయం రాక, పెట్టుబడి చేతికి అందక నష్టాల్లో కూరుకుపోతున్న అన్నదాతలకు మొక్కజొన్న సాగు ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా మొక్కజొన్న సాగు చేసే దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచిస్తున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.**

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ వాడకం తప్పనిసరి చేయడంతో పాటు డిస్టిలరీలు, ఇథనాల్ ప్లాంట్‌లు పెట్టే సంస్థలకు రాయితీలు, రుణాలు ఇవ్వడానికి ముందుకురావడంతో భవిష్యత్తులో జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా డిస్టిలరీ, ఇథనాల్ ప్లాంట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనికి తోడు ఇప్పటికే ఉన్న డిస్టిలరీలకు కూడా ముడి సరకుగా ఉపయోగపడే అవకాశం ఉన్నందున, ఈ సాగుకు మంచిరోజులు ఉన్నట్టుగా అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో గోవాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు డీపీఆర్ కూడా తయారుకానున్నది. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటయితే చెరకుతో పాటు మొక్కజొన్న, ముడి బియ్యం కూడా అవసరం కానున్నది. ఇప్పటికే జిల్లాలో చెరకు విస్తీర్ణం తగ్గిపోయింది. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటయితే మళ్లీ చెరకు సాగు పెంచవలసిన అవసరం ఉంది. ఇదే సమయంలో చెరకుతో పాటు తక్కువ పెట్టుబడితో తేలిపోయే మొక్కజొన్న కూడా రైతులు సాగు చేస్తే ఇథనాల్ ప్లాంట్‌కు అవసరమైన ముడిసరకు లభ్యమయ్యే అవకాశం ఉంది. ఈ కారణాల దృష్ట్యా ప్రభుత్వం కూడా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రైతులు మొక్కజొన్న సాగు చేసేలా ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించినట్టు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రైతులు వాణిజ్య స్థాయిలో మొక్కజొన్న సాగు చేయడం లేదు. ఖరీఫ్, రబీ కలిపి 150 హెక్టార్ల వరకు ప్రస్తుతం మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఉందని అంచనా. ఇథనాల్ ప్లాంట్‌కు అవసరమైన స్థాయిలో ముడిసరకు లభ్యం కావాలంటే ఈ విస్తీర్ణం మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ఈ దృష్ట్యా రానున్న రోజుల్లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

నిరంతరాయంగా తనిఖీలు

- డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహనకు గ్రామస్థాయిలో కమిటీలు
- మహిళల రక్షణకు ఉమెన్ సేఫ్టీ సెల్ ఏర్పాటు
- సైబర్ నేరాలపై లఘు చిత్రాలతో అవగాహన
- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎస్పీ ఎం.దీపిక



ఎం.దీపిక, జిల్లా ఎస్పీ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

'జిల్లా పరిధిలో ఎక్కడా గంజాయి సాగు జరగకపోయినా ఇతర ప్రాంతాల నుంచి జిల్లా మీదుగానే రవాణా జరుగుతోందని గుర్తించాం. నిషేధిత గంజాయి రవాణాను అడ్డుకొనేందుకు ప్రత్యేక నిఘా పెట్టాం. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతాం. మహిళల రక్షణ కోసం ఇప్పటికే ఉమెన్ సేఫ్టీ సెల్‌ను ఏర్పాటు చేశాం. చోరీలు, రోడ్డు ప్రమాదాలను అదుపు చేయడానికి పటిష్ఠ చర్యలు చేపడుతున్నాం' అని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

గంజాయి రవాణాకు చెక్ పెడతాం

జిల్లాను అడ్డాగా చేసుకొని కొందరు గత కొన్నేళ్లుగా గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించాం. రవాణాదారులకు చెక్ పెట్టేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. కృష్ణాదేవిపేట, గొలుగొండ, వి.మాడుగుల, దేవరాపల్లి మండలాల్లో 24 గంటలూ నిరంతరాయంగా తనిఖీలు జరిగేలా నాలుగు చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. వీటితో పాటు 22 డైనమిక్ చెకింగ్ పాయింట్లను ఏర్పాటు చేశాం. పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐ, ఎస్ఐల నేతృత్వంలో ఈ డైనమిక్ చెకింగ్ బృందాలు గంజాయి రవాణా జరుగుతున్నట్టు అనుమానం ఉంటే ఆకస్మిక తనిఖీలు చేస్తాయి. నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి వంటివి కొన్ని పార్సిల్, కొరియర్ సర్వీసు సంస్థల ద్వారా జరుగుతున్నట్టు సమాచారం ఉంది. ఈ మేరకు ట్రాన్స్‌పోర్టు ఆఫీసుల్లో తనిఖీలు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో కమిటీల నియామకాలు జరిగాయి. కమిటీల ద్వారా గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్ వినియోగం వల్ల ఎదురయ్యే నష్టాలపై అవగాహన కల్పిస్తాం. జిల్లాలో గతంలో గంజాయి రవాణా కేసులతో సంబంధాలున్న పాత నేరస్థులు 400 మందికి పైగా ఉన్నారు. వారందరి కదలికలపై నిఘా పెట్టాం. వారిపై కొత్తగా షీట్‌లు ఓపెన్ చేసి విచారణ జరుపుతున్నాం. గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న చిన్న ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలపై కేసులు పెట్టడమే కాకుండా రవాణాతో సంబంధాలున్న మూలాలను వెతికి తీసేందుకు వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటికే గంజాయి రవాణా కేసులతో సంబంధాలు ఉండి తప్పించు కొని తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నాం.

ఉమెన్ సేఫ్టీ సెల్ ఏర్పాటు

మహిళల రక్షణకు అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంగా ఉమెన్ సేఫ్టీ సెల్‌ను ఏర్పాటు చేశాం. స్కూళ్లు, కళాశాలలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో పోక్సో యాక్టు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గృహహింస తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

సైబర్ నేరాలపై దృష్టి

జిల్లాలో సైబర్ నేరాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు త్వరలో లఘు చిత్రాలను రూపొందించి విడుదల ... మిగతా 8వ పేజీలో

సాగునీటి పథకాల మరమ్మతుకు ప్రతిపాదనలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాజెక్టులు

- 82 మైనర్ ఇరిగేషన్ పనులకు రూ.26 కోట్లు
- మేజర్ ఇరిగేషన్ పనులకు రూ.2.63 కోట్లతో అంచనాలు



రావణాపల్లి గండిని పరిశీలిస్తున్న అధికారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 21: ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నర్సీపట్నం డివిజన్‌లో చెరువులు, చిన్న రిజర్వాయర్లు, గ్రోయిన్లు, తదితర 82 మైనర్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు రూ.2.28 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. శాశ్వత పరిష్కారానికి రూ.26 కోట్లు అవుతుందని ప్రతిపాదించారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు తాండవ కాలువ 32 చోట్ల దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఉదాహరణకు తాండవ కుడికాలువ 1.4 కిలోమీటరు వద్ద మట్టి జారిపోయింది. ఎడమ కాలువకు 2.4 కిలోమీటరు వద్ద గండి పడింది. తాండవ ప్రాజెక్టు పరిధిలో 32 పనుల తాత్కాలిక మరమ్మతులకు రూ.7.5 లక్షలు, శాశ్వత పరిష్కారానికి రూ.2.63 కోట్లు అవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని డీఈఈ బి.గుంపస్వామినాయుడు తెలిపారు.

స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

స్వచ్ఛమైన నేతితో తయారు చేసినవంటూ మోసం చేస్తున్న కొంతమంది దుకాణదారులు

- డాల్డా, పామాయిల్, తదితరాలు మిక్సింగ్
- కలర్ కోసం రంగులు...
- పట్టని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- కాస్త నాణ్యమైన నెయ్యి కొనాలంటే కిలోకు రూ.800 నుంచి రూ.1,600 పెట్టాల్సిందే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'నేతి బీరకాయ' చందంలాగే నేతి మిఠాయిలు తయారవుతున్నాయి. 'స్వచ్ఛమైన నేతితో తయారైన స్వీట్లు' అంటూ భారీ బోర్డులు పెట్టి పెద్దఎత్తున విక్రయాలు చేస్తున్న సంస్థలు అడ్డగోలుగా మోసాలకు పాల్పడుతున్నాయి. విశాఖలో వీధికి రెండు స్వీటు దుకాణాలు వెలిశాయి. 'వేడి వేడి నేతి బొబ్బట్లు' అంటూ అక్కడే పెనం పెట్టి, దానిపై బొబ్బట్లు అటు ఇటు తిప్పుతూ...గరిటెతో నెయ్యి పోసి వేడి వేడివి ప్యాకింగ్ చేసి ఇస్తున్నాయి. కిలోకు కేవలం రూ.230 నుంచి రూ.260 తీసుకుంటున్నాయి. కొనుగోలుదారులకు కనీసం అది నిజంగా నెయ్యేనా?. అనే అనుమానమే రావడం లేదు. అలాగే నెయ్యితో తయారుచేసిన లడ్డూలంటూ అదనంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. కనీసం ముక్కుకు నెయ్యి వాసన కూడా రాదు.



కిలో నెయ్యి రూ.600కి తక్కువ లేదు

నగరంలో కిలో నెయ్యి ఎవరూ రూ.600 కంటే తక్కువకు ఇవ్వడం లేదు. విశాఖ డెయిరీ కిలో రూ.660 చొప్పున అమ్ముతోంది. అదే ఆవులను పెంచుతూ పాల వ్యాపారం చేసేవారైతే కిలో రూ.800పైనే అమ్ముతున్నారు. ఆర్గానిక్ వ్యవసాయం చేసేవారైతే దేశీ ఆవు నెయ్యి రూ.1,600, గిరి ఆవుల నెయ్యి కిలో రూ.2,500 చొప్పున విక్రయిస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యి కిలో తయారు చేయాలంటే కనీసం 15 లీటర్ల పాలు అవసరం. రైతుల నుంచి కొనే పాలు లీటరు రూ.40 వేసుకున్నా (విశాఖ డెయిరీవి రూ.60పైనే) పాలకే రూ.600 వ్యయం అవుతుంది. వాటిని వేడి చేయడానికి, గంటల తరబడి ప్రాసెస్ చేయడానికి ఇంకో రూ.150 ఖర్చు అవుతుంది. అంటే సాధారణ పాలతో కిలో నెయ్యి తయారీకి రూ.750 వ్యయం అవుతుంది. రూ.50 లాభం వేసుకొని కిలో రూ.800కి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ నెయ్యిని చెంచాతో తీసి ముక్కు దగ్గర పెట్టుకుంటే చక్కటి సువాసన వస్తుంది. అయితే రోజూ డబ్బాల కొద్దీ (డబ్బాకి 15 కిలోలు) నెయ్యి వాడే స్వీటు షాపుల వారు కాంట్రాక్టర్ల నుంచి కిలో రూ.400 కంటే తక్కువకే కొంటున్నారు. అంత తక్కువ రేటుకు నాణ్యమైన నెయ్యి రానే రాదు. ఆ విషయం దుకాణాల యజమానులకూ తెలుసు. అయినా కొంటున్నారు. సరఫరాదారులు కొందరు నెయ్యిలో డాల్డా ... మిగతా 8వ పేజీలో

వెంకన్న పుష్కరిణిపై చిన్నచూపు

నాచు పట్టి అధ్వానం

- భక్తులు కాలు పెట్టలేని దుస్థితి
- 3 నుంచి బ్రహ్మోత్సవాలు
- పట్టించుకోని టీటీడీ అధికారులు



నాచు పట్టి అధ్వానంగా ఉన్న పుష్కరిణి

నక్కపల్లి, సెప్టెంబరు 21: **ఎంతో చరిత్ర గల ఉపమాక దేవస్థానంపై టీటీడీ చిన్నచూపు చూస్తోంది. ఆలయాన్ని స్వాధీనం చేసుకొని తొమ్మిదేళ్లు అయినా అభివృద్ధిపై శ్రద్ధ చూపడం లేదు. ఉపమాక దేవస్థానాన్ని స్వాధీనం చేసుకున్న తొలి రెండేళ్లు పలు ఉత్సవాలు చేసేటప్పుడు టీటీడీ అధికారులు చేసిన హడావిడి చూసి వెంకన్న భక్తులంతా ఉపమాకకు మంచి రోజులొచ్చాయని సంబరపడ్డారు. తరువాత అది ఆరంభశూరత్వమేనని తేలింది. చివరకు స్వామివారి పుష్కరిణి పట్ల కూడా నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారు.**

ఉపమాక దేవస్థానానికి ఆనుకుని స్వామివారి పుష్కరిణి వుంది. పూర్వం ఇక్కడ బ్రహ్మ తపస్సు చేసినట్టు స్థల పురాణం చెబుతోంది. అంతటి ప్రాశస్త్యం గల ఈ సరస్సును ప్రస్తుతం చూస్తే ఎవరైనా సరే అసహ్యించుకుంటారు. ఒకప్పుడు వెంకన్న ఆలయాన్ని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు ఈ కోనేటిలోకి దిగి, జలాలను తమ శిరస్సుపై చల్లుకుని సంప్రోక్షించుకునేవారు. అంటే.. ఈ చెరువు జలాలపై అంతటి భక్తిభావం చూపేవారు. ఇక, అనేక మంది భక్తులు ఉత్సవాల సమయాల్లోనూ, ఈ పుష్కరిణిలోనే స్నానాలు చేసేవారు. ఉపమాక పరిసర గ్రామాల ప్రజలు కూడా ఈ పుష్కరిణిలోనే పూర్వం నుంచి స్నానాలు చేసినా, ఎప్పుడూ జలాలు పాడైన దాఖలాల్లేవు. ఒకప్పుడు స్వామివారి ఆలయంలో తీర్థ జలాలకు ఈ పుష్కరిణి నుంచే తీసుకువెళ్లేవారు. కానీ ప్రస్తుతం పుష్కరిణి పూర్తిగా కలుషితమైంది. చెరువు నలువైపులా నాచు పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. గత ఏడాది 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలతో నాచు తీసే కార్యక్రమాన్ని మొక్కుబడిగా చేపట్టారు. తరువాత మళ్లీ పరిస్థితి మామూలే. అనేక మంది భవానీ దీక్షాపరులు, కార్తీకమాసంలో అయ్యప్పదీక్షా పరులు ఈ పుష్కరిణిలోనే స్నానాలు చేసేవారు. ప్రస్తుతం ఈ పుష్కరిణిలో భక్తులు కాలు పెట్టలేనంత చెత్తగా వుంది. స్వామివారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్నాయి. కానీ టీటీడీ అధికారులకు మాత్రం ఈ ఆలయం, పుష్కరిణిపై నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హోం మంత్రి అనిత ప్రత్యేక దృష్టి పెట్టి, ఉపమాక ఆలయం, పుష్కరిణి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వెంకన్న భక్తులు కోరుతున్నారు.

కొలిక్కివచ్చిన రెవెన్యూ బదిలీలు?

- నేడు జాబితా విడుదల చేసే అవకాశం
- మిగిలిన శాఖల్లోనూ...

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు ఆదివారంతో గడువు ముగియనున్నది. గడువు మరోసారి పొడిగిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ శాఖాపరంగా బదిలీలకు కసరత్తు ముగిసినట్టు చెబుతున్నారు. బహుశా ఆదివారం బదిలీ ఉత్తర్వులు వెలువడవచ్చునంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆదివారం బదిలీ ఉత్తర్వులు రావాలని, లేకపోతే అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్ల పరిస్థితి మరింత ఇబ్బందిగా మారే అవకాశం ఉందంటున్నారు. అనకాపల్లి జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లో తహసీల్దార్లకు పోస్టింగ్స్‌పై జూలై నుంచి అనిశ్చితి కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఉత్తరాంధ్రలో మిగిలిన రెండు ఉమ్మడి జిల్లాలకు వెళ్లి జూలైలో వెనక్కి వచ్చిన తహసీల్దార్లకు గతంలో పనిచేసిన మండలం కాకుండా మరోచోట పోస్టింగ్ ఇవ్వాలి. కానీ ఇంతవరకూ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ... మిగతా 8వ పేజీలో

ఆ ఇంటి మహాలక్ష్మి

దివ్యాంగురాలైనా ఆ కుటుంబానికి ఆమే పెద్ద దిక్కు

- కాళ్లు, చేతులు, నడుము సహకరించకపోయినా బడ్డీ పెట్టుకుని కుటుంబ పోషణ
- సోదరి కుటుంబానికి కూడా ఆసరా
- ఎల్.సింగవరం గ్రామస్థుల అభిమానాన్ని పొందిన రామలక్ష్మి

నేడు ప్రపంచ కుమార్తెల దినోత్సవం సందర్భంగా..



బడ్డీ నిర్వహిస్తున్న రామలక్ష్మి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 21: **ఆ ఇంట ఆమె మొదటి సంతాపం. పుట్టుకతోనే దివ్యాంగురాలు. అయితేనేం స్వయం ఉపాధితో ఆ కుటుంబాన్నే ఆదుకుంటున్న ధీర మహిళ. చేతులు, కాళ్లు చచ్చుబడి పోయి నడుము సహకరించకపోయినా బడ్డీ పెట్టుకుని ఆ సంపాదనతో ఇంటిని పోషిస్తోంది.. బుచ్చెయ్యపేట మండలం ఎల్.సింగవరం గ్రామానికి చెందిన రేణం రామలక్ష్మి. ఈ నెల 22న ప్రపంచ కుమార్తెల దినోత్సవం సందర్భంగా ఆమె గురించి తెలుసుకుందాం.**

బుచ్చెయ్యపేట మండలం, ఎల్.సింగవరం గ్రామానికి చెందిన రేణం రామునాయుడు, కాసులమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొదటి కుమార్తె రామలక్ష్మి (38) పుట్టుకతోనే దివ్యాంగురాలు. పోలియో వల్ల రెండు కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. నడుము నిటారుగా నిలవదు. అయినా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివింది. ఆ తరువాత తండ్రిని ఒప్పించి గ్రామంలో బీఎస్ రోడ్డు పక్కన బడ్డీ ఏర్పాటు చేసి చిన్న వ్యాపారం ప్రారంభించింది. ఉదయం బడ్డీలో రామలక్ష్మిని కూర్చోబెట్టి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేవారు. బడ్డీలో సిగరెట్లు, ఫ్యాన్సీ వస్తువులు, చిరుతినుబండారాలు విక్రయించగా వచ్చిన లాభాలతో కుటుంబ పోషణకు ఖర్చు చేసేది. 12 సంవత్సరాల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీ

▸ ఇద్దరికి తీవ్ర గాయాలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 21: దారెల పంచాయతీ పరిధిలోని వరండాపుట్టు గ్రామ సమీపంలో మలుపువద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సుజనకోట పం చాయతీ గొడుగులపుట్టు గ్రామానికి చెందిన బి.మోహన్‌పాత్రో ముంచంగిపుట్టులో శనివారం జరిగిన వారపు సంతకు సైకిల్‌పై వచ్చి ఇంటికి తిరిగి పయమయ్యాడు. అదే సమయంలో అదే పంచాయతీ వనుగుపుట్టు గ్రామానికి చెందిన వి.మనోజ్, ఏనుగురాయి పంచాయతీ బొండాపుట్టు గ్రామానికి చెందిన కె.ఉదయ్ ద్విచక్ర వాహనంపై ముంచంగిపుట్టు వస్తున్నారు. మార్గమధ్యంలోని వరండాపుట్టు మలుపు వద్ద వీరు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. దీంతో సైకిలిస్టు మోహన్‌పాత్రో, బైక్‌పై ఉన్న ఉదయ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సీహెచ్‌సీలో చేర్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ గీతాంజలి, వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల కోసం అల్లూరి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆటో అదుపు తప్పి నలుగురు విద్యార్థులకు గాయాలు

కశింకోట, సెప్టెంబరు 21 : మండలంలోని వెదురుపర్తి మీదుగా కశింకోటకు పాఠశాల విద్యార్థులతో వస్తున్న ఆటో అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 20 మంది విద్యార్థుల్లో ఒక విద్యార్థినికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని మిగిలిన విద్యార్థులను ఇళ్లకు తీసుకు వెళ్లిపోయారు. కాగా తీవ్రంగా గాయపడిన కుక్కల రామచంద్రిక, మరో ముగ్గురు విద్యార్థులను అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రామచంద్రిక ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మిగిలిన ముగ్గుర్ని ఇంటికి పంపినట్టు గ్రామస్థులు తెలిపారు.

ఇటలీ పర్యాటకులకు తప్పిన ప్రాణాపాయం

మల్కాపురం/సింధియా, సెప్టెంబరు 21: విశాఖ నగర శివారునున్న యారాడ వద్ద సముద్ర స్నానానికి దిగి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న విదేశీ పర్యాటకులను లైఫ్‌గార్డులు రక్షించారు. ఇటలీ దేశానికి చెందిన దాదాపు పది మంది శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో యారాడ తీరం సందర్శనకు వచ్చారు. వీరిలో ఐదుగురు స్నానానికి దిగారు. ఒక్కసారిగా వచ్చిన కెరటానికి స్నానం చేస్తున్న ఐదుగురిలో నలుగురు కొంతదూరం కొట్టుకుపోయారు. ఒకరు బయటకు ఈదుకుంటూ వచ్చారు. కెరటాల్లో చిక్కుకున్న మిగిలిన నలుగురు కేకలు వేయడంతో లైఫ్‌గార్డులు (గజ ఈతగాళ్లు), మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే లైఫ్ గార్డులు సముద్రంలోకి వెళ్లి నలుగురు విదేశీయులను కాపాడారు. తమ ప్రాణాలను కాపాడిన స్విమ్మర్లు కె.వెంకటేష్, కె.లోవరాజు, సీహెచ్ శ్రీనివాస్ లకు విదేశీయులు కృతజ్ఞతలు తెలిపారు. యారాడ తీరంలో ఈతకు దిగరాదని, గతంలో ఇక్కడ అనేక మంది చనిపోయారని అరుణేశ్వరరావు (పీసీ), సీహెచ్ అప్పారావు (హెచ్‌జీ) ఈ సందర్భంగా హెచ్చరించారు. విదేశీయులను ముందుగా హెచ్చరించినా భాష సమస్యతో వారు వినిపించుకోకుండా ముందుకువెళ్లారన్నారు.

'లారస్'ను సందర్శించిన వెంకయ్యనాయుడు



ఔషధాల తయారీపై వెంకయ్యనాయుడుకు వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పరవాడ, సెప్టెంబరు 21: ఇక్కడి ఫార్మాసిటీలో గల లారస్ ల్యాబ్స్ యూనిట్-1 పరిశ్రమను భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం సందర్శించారు. తొలుత ఆయనకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సి.లక్ష్మణరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) చావా నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్) ఎస్ఎస్ రావు ఘన స్వాగతం పలికారు. పరిశ్రమలోని అన్ని విభాగాల గురించి వెంకయ్యనాయుడుకు వివరించారు. ఔషధాల తయారీతో పాటు ఫార్మాసూటికల్ రంగంలో లారస్ ల్యాబ్స్ పోషిస్తున్న పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) బోడేపూడి రామకృష్ణ, సీనియర్ జనరల్ మేనేజర్ సునీతాదంతా పాల్గొన్నారు.

నేడు ఆలస్యంగా బయలుదేరనున్న రైళ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 21: ఖరగ్‌పూర్ డివిజన్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో హౌరా, షాలిమార్, సంత్రాగచ్చి స్టేషన్ల నుంచి ఆదివారం (22న) బయలుదేరే పలు రైళ్లను రీ షెడ్యూల్ చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో ఆదివారం (22న) హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) నాలుగు గంటలు ఆలస్యంగా, హౌరా-బెంగళూరు దురంతో (12245), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) లు గంట ఆలస్యంగా, సంత్రాగచ్చి-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (07222) అరగంట ఆలస్యంగా బయలుదేరుతాయని పేర్కొన్నారు.

పాల్మన్‌పేట సర్పంచ్ మూడు నెలలు సస్పెండ్

▸ అధికార దుర్వినియోగం నిర్ధారణ కావడంతో డీపీవో చర్యలు

పాయకరావుపేట, సెప్టెంబరు 21 : మండలంలోని పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావును మూడు నెలల పాటు సర్పంచ్ పదవి నుంచి సస్పెండ్ డీపీవో ఆర్.శిరీషారాణి ఉత్తర్వులు జారీచేశారు. సర్పంచ్ కోటేశ్వరరావు సాల్వేషన్ సర్టిఫికెట్లు జారీచేసి అధికార దుర్వినియోగం చేశారని అదే గ్రామానికి చెందిన ఎం.అశోకచక్రవర్తి అనే వ్యక్తి 2021లో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై చేపట్టిన విచారణలో కోటేశ్వరరావు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు రుజువు కావడంతో పాటు హై కోర్టు కూడా నిర్ధారించడంతో ఆయనను సర్పంచ్ పదవి నుంచి మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తూ డీపీవో ఆదేశాలు జారీచేశారని పంచాయతీ అధికారుల ద్వారా తెలిసింది

'సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయం'



సంతాపసభలో మాట్లాడుతూ అజశర్మ


అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 : దివంగత నేత సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అనకాపల్లిలో సీతారాం ఏచూరి సంతాప సభ ఏర్పాటైంది. ముందుగా ఆయన చిత్రపటానికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతతత్వం, కార్పొరేట్ శక్తుల కలయికపై సైద్ధాంతికంగా పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజల తరపున నిక్కచ్చిగా పోరాడిన వ్యక్తి ఏచూరిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ఎస్ నారాయణ, గంటా శ్రీరామ్, పెంటకోట శ్రీనివాసరావు, కె.తేలయ్యబాబు, ఆర్.రమేష్, రమణాజీ, వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

భయంతోనే ప్రాణాల మీదకు...

ఉత్తరాంధ్రలో కేన్సర్ కేసుల గుర్తింపులో తీవ్ర జాప్యం



▸ మూడు, నాలుగు స్టేజ్‌ల్లో ఆస్పత్రులకు వస్తున్న రోగులు

▸ ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడలేకపోతున్న వైద్యులు

▸ భయాన్ని, అపోహలను వీడితే సమస్యకు పరిష్కారం

▸ కేన్సర్ బారినపడినా మెరుగైన వైద్య సేవలతో సాధారణ జీవితం

▸ నేడు వరల్డ్ రోజ్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ప్రపంచ వ్యాప్తంగా కేన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఏటా లక్షలాది మంది కేన్సర్ మహమ్మారి బారినపడి మృతి చెందుతున్నారు. ప్రపంచానికి సవాల్ విసురుతున్న రోగాల్లో కేన్సర్ రెండో స్థానంలో ఉంది. కేన్సర్ బారినపడ్డామని తెలిసినా, లక్షణాలు ఉన్నట్టు అనుమానం కలిగినా చాలామంది భయాందోళనకు గురవుతుంటారు. కొంతమందికి అనుమానిత లక్షణాలు ఉన్నప్పటికీ వైద్య పరీక్షలు చేయించుకునేందుకు కూడా ఆసక్తి చూపించడం లేదు. ఆ భయమే కేన్సర్ వ్యాధి బాధితులు తక్కువ వ్యవధిలోనే మృతి చెందేందుకు కారణమవుతోంది. కేన్సర్ వ్యాధి కూడా మిగిలిన రోగాల వంటిదేనని, సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే సాధారణ జీవితాన్ని గడిపే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. భయం వ్యాధి కంటే ప్రమాదకరమైనదని, ధైర్యం మందు కంటే గొప్పదని వైద్యులు చెబుతున్నారు. కేన్సర్ వ్యాధిని కూడా ధైర్యంతో సమర్థవంతంగా ఎదుర్కొంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చని పేర్కొంటున్నారు. కేన్సర్ రోగుల్లో ఉన్న భయాన్ని తొలగించి, వారికి సాంత్వన కలిగించడంతో పాటు బతుకుతావన్న భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో ఏటా సెప్టెంబర్ 22న కేన్సర్ రోగుల సాంత్వన దినోత్సవంగా (రోజ్ డే) నిర్వహిస్తున్నారు. ఆదివారం రోజ్ డేను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఆ చిన్నారి జ్ఞాపకార్థం..

అరుదైన కేన్సర్ వ్యాధితో పోరాడుతూ మృతి చెందిన చిన్నారి మిలిండా రోజ్ జ్ఞాపకార్థం రోజ్ డేను 2000వ సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నారు. ఆ చిన్నారికి కేన్సర్ సోకిందని గుర్తించిన వైద్యులు రెండు వారాల కంటే ఎక్కువ రోజులు బతికే అవకాశం లేదని చెప్పారు. తాను చనిపోతానన్న విషయం తెలిసినప్పటికీ ఆ చిన్నారి ఆస్పత్రిలోని ఇతర రోగుల్లో ఆనందాన్ని నింపేందుకు ప్రయత్నించింది. పాటలు పాడుతు, డ్యాన్స్‌లు చేస్తూ కేన్సర్ రోగుల్లో ఆనందాన్ని నింపే ప్రయత్నం చేయడంతో సుమారు ఆరు నెలల పాటు మిలిండా రోజ్ జీవించడం వైద్యులనే ఆశ్చర్యానికి గురి చేసింది. ఇందుకు ఆ చిన్నారి అందరితో ఆనందంగా గడపడమే కారణంగా వైద్యులు భావించారు. కేన్సర్ రోగుల్లో అటువంటి ఆనందాన్ని సంతోషాన్ని నింపడం ద్వారా మరింత కాలం వారు జీవించేలా చేయవచ్చన్న ఉద్దేశంతోనే రోజ్ డేను నిర్వహిస్తున్నారు.

ప్రాణాలను తీస్తున్న భయం

ఏపీలో ఏటా సుమారు 70 వేల నుంచి 75 వేల కేన్సర్ కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఏటా కేన్సర్‌తో చికిత్స పొందుతూ సుమారు 35 వేల నుంచి 40 వేల మంది మృతి చెందుతున్నారు. వీటిలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో లెక్కలను తీసుకుంటే సుమారు 18 వేల నుంచి 20 వేల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతుండగా, ఏటా ఏడు వేల నుంచి తొమ్మిది వేల మంది మృతి చెందుతున్నారు. ఉత్తరాంధ్రలో నమోదవుతున్న కేన్సర్ కేసుల్లో దాదాపు 80 నుంచి 90 శాతం మంది రోగులు మూడు, నాలుగు స్టేజుల్లో ఆస్పత్రులకు వస్తున్నారు. దీనివల్ల ప్రాణాలను కాపాడడం సాధ్యం కావడం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముందుగా కేన్సర్ కేసులను గుర్తిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, కానీ చాలామందిలో భయం, ముందస్తు పరీక్షలు చేయించుకుంటే కేన్సర్ అని తేలుతుందేమోనన్న ఆందోళన పరిస్థితి చేయి దాటిపోయేలా చేస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. దీంతో కేన్సర్ బారినపడుతున్న రోగుల్లో భయంతోనే అత్యధికులు మృతి చెందుతున్నారు. కుటుంబ సభ్యులకు కేన్సర్ పట్ల అవగాహన లేకపోవడం, దీని బారినపడిన తరువాత పూర్తిగా మంచానికే పరిమితం కావడం వల్ల మరింత నిరాశ, నిస్పృహలకు లోనై ప్రాణాలు కోల్పోతున్నట్టు వైద్యులు తెలుపుతున్నారు.



ముందుగా గుర్తిస్తే మేలు..

కేన్సర్ లక్షణాలు లేకుండానే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే ప్రాథమిక స్థాయిలోకి రాకుండానే కొన్ని లక్షణాలను గుర్తించేందుకు అవకాశం ఉంది. దీన్ని జీరో స్టేజ్‌గా చెబుతారు. ఈ స్టేజ్‌లో వ్యాధిని గుర్తిస్తే 99 శాతం మేర ప్రాణాలను కాపాడవచ్చు. లక్షణాలను వెంటనే గుర్తిస్తే దాన్ని మొదటి స్టేజ్‌గా చెబుతారు. ఈ స్టేజ్‌లో 95 నుంచి 98 శాతం మేర ప్రాణాలను కాపాడవచ్చు. రెండో స్టేజ్‌లో గుర్తిస్తే 70 శాతం, మూడో స్టేజ్‌లో గుర్తిస్తే 50 శాతం వరకు ప్రాణాలను రక్షించే అవకాశం ఉంది. నాలుగో స్టేజ్‌లో బాధితులు ఆస్పత్రులకు వస్తే మాత్రం పది శాతం కంటే తక్కువ మందికి మాత్రమే ఐదేళ్లపాటు జీవించే అవకాశం దక్కుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఈ కేసులు ఎక్కువ..

ఉత్తరాంధ్రలో నమోదయ్యే ప్రతి వంద కేన్సర్ కేసుల్లో 30 వరకు నోటి కేన్సర్లు, 15 అన్న వాహిక, 10 లంగ్, 8 నుంచి 9 వరకు రొమ్ము, ఐదు నుంచి ఎనిమిది వరకు సర్వైకల్, మిగిలినవి చర్మ, మెదడు, ఎముకలు, రక్త కేన్సర్లు ఉంటున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

ఆత్మస్థైర్యంతో వైద్యం చేయించుకోవాలి

-డాక్టర్ వై.విజయ ఆదిత్య, అంకాలజీ వైద్య నిపుణులు, హెచ్‌సీజీ కేన్సర్ ఆస్పత్రి



వ్యాధి కంటే భయమే ప్రాణాలను తీస్తుంది. కేన్సర్ వ్యాధిలో దాని తీవ్రత కాస్త ఎక్కువగా ఉంటుందని చెప్పాలి. కేన్సర్ వ్యాధి బారినపడిన రోగుల్లో దాదాపు 90 శాతం మంది తమ జీవితం అయిపోయిందన్న భావనలో ఉంటున్నారు. కుటుంబ సభ్యులు కూడా అదే ఆలోచనలో ఉంటున్నారు. కానీ కేన్సర్‌తో చికిత్స పొందుతూ కూడా భయాన్ని విడనాడి సాధారణ జీవితాన్ని కొనసాగించవచ్చు. ధైర్యంగా చికిత్స పొందడం ద్వారా మెరుగైన జీవనాన్ని పొందేందుకు అవకాశం ఉంది. రోగుల భయమే ప్రాణాలను తీస్తోంది. కొన్ని వారాలకు మించి బతకదు అనుకున్న చిన్నారి మిలిండా రోజ్ అందరితో ఆనందంగా గడిపి ఆరు నెలలపాటు బతికి వైద్యులనే ఆశ్చర్యానికి గురి చేసింది. తనకు కేన్సర్ అన్న విషయాన్ని ఆ చిన్నారి మరిచిపోయి రోజువారీ జీవితాన్ని ఆనందంగా గడపడం వల్లే మరింత కాలం బతికేలా చేసింది. అదే అందరూ ఆత్మస్థైర్యంతో వైద్యం చేయించుకోవాలి. ముందస్తు పరీక్షలు చేయించుకునేందుకు భయపడకూడదు. వ్యాధి ఉంటేనే నిర్ధారణ అవుతుంది. ఈ విషయంలో అపోహలు విడనాడాలి. స్క్రీనింగ్ పరీక్షలకు మహిళలు, పురుషులు ముందుకు రావాలి.

సుపరిపాలన 'కూటమి'కే సాధ్యం

▸ వంద రోజుల్లోనే నిరూపణ

▸ 'ఇది మంచి ప్రభుత్వం'లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కొత్తఎల్లవరంలో కరపత్రాలు పంచుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, సెప్టెంబరు 21: సుపరిపాలన అందించడం ద్వారా వంద రోజులలోనే 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకున్న ప్రభుత్వం తమదని ఏపీ శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మండలంలోని కొత్తఎల్లవరం గ్రామపంచాయతీలో శనివారం ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతుందని, అవసరాలను తీర్చుతుందని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ రద్దు, పింఛన్ల పెంపు వంటి ప్రధాన హామీలు ఇప్పటికే నెరవేర్చామని.. మరి కొన్నింటిని త్వరలోనే అమలు చేయనున్నామని చెప్పారు. ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. కొత్తఎల్లవరం గ్రామానికి వందరోజుల్లో రూ.రెండు కోట్ల ఎనభై లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు.

కాలువలు, రోడ్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. కొత్తఎల్లవరం, కశిమి, జమ్మవరం రెవెన్యూలో ఎన్నో ఏళ్లుగా దీర్ఘకాలిక సమస్య ఈనాం భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పంచాయతీరాజ్ శాఖామంత్రిగా పవన్‌కల్యాణ్ పంచాయతీల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు, ఎంపీడీవో డేవిడ్‌రాజ్, డీఎల్‌డీవో ఉదయశ్రీ, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, స్థానిక సర్పంచ్ కొల్లి రాంబాబు, మండల నాయకులు చిటికెల సాంబమూర్తి, కొల్లి సత్తిబాబు, క. రవివర్మ, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

▸ 'స్వచ్ఛత హీ సేవ'లో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక



కలెక్టరేట్ ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రతలో పాల్గొన్న కలెక్టర్

అనకాపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి శంకరంలోని కలెక్టరేట్ పరిసరాల్లోని పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తాచెదారాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ సిబ్బందితో కలిసి స్వయంగా పలుగు, పార పట్టుకొని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నెలలో ఒక రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి అధికారులు, ఉద్యోగులు భాగస్వాములు కావాల్సిందిగా కోరారు. అలాగే, జిల్లా ఎస్పీ కార్యాలయంలో చేపట్టిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక పాల్గొని చెత్త తొలగింపు పనుల్లో సిబ్బందికి సహకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం

నక్కపల్లి, సెప్టెంబరు 21 : ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ శనివారం మధ్యాహ్నం ప్రారంభమైంది. ఇసుక కావల్సిన లబ్ధిదారులు, వినియోగదారులు ఇసుక డిపో వద్దకు వచ్చి పడిగాపులు పడకుండా, నేరుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఇసుక పొందే అవకాశాన్ని కూటమి సర్కారు కల్పించింది. ఆన్‌లైన్‌లో బుకింగ్ అనంతరం ఈ డిపో పరిధిలో జీపీఎస్ చేసుకున్న ట్రాక్టర్లు, లారీల యజమానులకు సంబంధిత యాప్ ద్వారా ఇసుక తరలించాల్సిన వినియోగదారుల ఫోన్‌కు అనుసంధానం చేస్తూ మెసేజ్ పంపుతారు. వెంటనే డిపో నుంచి సంబంధిత ప్రాంతానికి ఇసుకను పంపిస్తారు. శనివారం లాంఛనంగా మైన్స్ అధికారుల పర్యవేక్షణలో ఇసుక ఆన్‌లైన్ బుకింగ్, రవాణా ప్రారంభించారు. ప్రస్తుతం జీఎస్‌టీతో కలిపి టన్ను ఇసుక రూ. 1165లుగా నిర్ణయించారు. ఒక యూనిట్ (ట్రాక్టర్)కు ఐదు టన్నుల ఇసుకను లోడింగ్ చేస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన ఐదు టన్నుల అమౌంట్ ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఇదికాక రవాణా చేసినందుకు ట్రాక్టర్ నిర్వాహకులకు రూ.600 నుంచి రూ. 800 చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ వల్ల తమకు సమయం ఆదా అవుతుందని పలువురు వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

బెంగళూరు-గౌహతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

▸ ఎస్-7 బోగీ చక్రాల నుంచి వ్యాపించిన మంటలు

▸ ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడంతో సింహాచలం రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైలు

▸ తక్షణమే స్పందించి మంటలను అదుపుచేసిన భద్రతా సిబ్బంది



రైలుదిగి ట్రాక్‌పైకి వచ్చిన ప్రయాణికులు

విశాఖపట్నం, సెప్టెంబరు 21: బెంగళూరు నుంచి గౌహతి వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు శనివారం రాత్రి ప్రమాదం తప్పింది. ఓ బోగీ కింద నుంచి మంటలు, పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు గమనించి చైన్ లాగారు. రైలు ఆగిన వెంటనే భయాందోళనతో ప్రయాణికులు హాహాకారాలతో పరుగులు తీశారు. సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపుచేశారు. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి గౌహతి వెళుతున్న (రైలు నెంబరు 12509) రైలు విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి శనివారం రాత్రి 8.50 గంటలకు బయలుదేరింది. గోపాలపట్నం ఆర్‌ఆర్‌ఐ కేబిన్ వద్దకు చేరుకునే సరికి ఎస్-7 బోగీ చక్రాలకు బ్రేక్ షూలు పట్టేయడంతో తీవ్రమైన రాపిడి జరిగి కింద నుంచి మంటలు రావడంతో పాటు దట్టమైన పొగలు వ్యాపించాయి. బోగీ కింద నుంచి పొగలు రావడం గమనించిన కొందరు ప్రయాణికులు చైన్ లాగారు. దీంతో రైలును రాత్రి 9.05 గంటలకు సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆపారు. రైలు ఆగిన వెంటనే ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ కిందకు దూకి పరుగులు పెట్టారు. మరోవైపు సమీపంలో ఉన్న భద్రతా సిబ్బంది, స్టేషన్ అధికారులు, రైలులోని సిబ్బంది తక్షణమే స్పందించి అగ్నిమాపక యంత్రంతో మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. అనంతరం రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టి ఎటువంటి ఇబ్బంది లేదని నిర్ధారించడంతో రాత్రి 9.30 గంటలకు సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి రైలు బయలుదేరి వెళ్లింది. సింహాచలం స్టేషన్‌లో రైలు ఆగగానే ప్రయాణికులు కొందరు కిందకు దూకి పరుగులు తీశారు.

ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలపై సమగ్ర విచారణ

▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, సెప్టెంబరు 21: వైసీపీ ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపిస్తామని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి మండలం సంపతిపురంలో శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు, పేదల భూములను రక్షించడం కోసమే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో చేపట్టిన ప్రగతిని వివరించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఆర్డీవో చిన్నికృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, గ్రామ సర్పంచ్ నంబారు నాగమణి, టీడీపీ సీనియర్ నాయకుడు నంబారు శ్రీను, ఎంపీటీసీ కడిమి గణేష్ పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూటమి నాయకులు

కొయ్యూరు, సెప్టెంబరు 21: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూలో కల్తీకి పాల్పడ్డారంటూ మాజీ సీఎం జగన్మోహనరెడ్డి దిష్టిబొమ్మను కూటమి నాయకులు శనివారం దహనం చేశారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యితో తయారు చేయాల్సిన తిరుమల ప్రసాదంలో కల్తీకి పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో జగన్‌తో పాటు టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు, బీజేపీ మండల నేత చక్రధరరావు, కూటమి నాయకులు మేడిబోయిన సత్తిబాబు, మాకాడ బూర్జులయ్య, నాగేశ్వరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలో మౌనికకు స్వర్ణ పతకం



నర్సీపట్నం, సెప్టెంబరు 21: గౌహతిలో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో నర్సీపట్నంకు చెందిన బొంతు మౌనిక 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. గౌహతిలో ఈనెల 14 నుంచి 21 వరకు జరిగిన బాక్సింగ్ పోటీలు జరిగాయి. శుక్రవారం మణిపూర్ బాక్సర్‌ని ఓడించిన మౌనిక ఫైనల్స్‌కు చేరింది. శనివారం పంజాబ్ బాక్సర్‌తో తలబడి తొలి రౌండ్‌లోనే రెండు సార్లు కౌంట్ ఇచ్చి అత్యధిక స్కోర్‌తో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మౌనికకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.లక్ష్మణ్‌దేవ్ అభినందనలు తెలిపారు.

సబ్ జైలును పరిశీలించిన న్యాయమూర్తి



రికార్డును పరిశీలిస్తున్న న్యాయమూర్తి ధర్మారావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 : ఇక్కడి సబ్ జైలును మండల అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు శనివారం పరిశీలించారు. రిమాండ్‌లో ఉన్న పలువురు నిందితులతో మాట్లాడారు. ఏఏ నేరాల్లో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఆహారంలో అందిస్తున్న మెనూపై ఆరా తీశారు. జైలు పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరాం, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇంటి మహాలక్ష్మి

... 5వ పేజీ తరువాయి

కుటుంబ భారం రామలక్ష్మిపై పడింది. సోదరి మణికి వివాహం చేసింది. సోదరికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆ తరువాత సోదరి భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో పిల్లలతో సహ పుట్టింటికి చేరింది. సోదరి కుటుంబానికి కూడా రామలక్ష్మి ఆసరాగా నిలిచింది. అందరినీ అన్నా అని ఆప్యాయంగా పిలిచే రామలక్ష్మి అంటే గ్రామస్థులకు ఎంతో అభిమానం. రోజువారీ సంపాదనతో కుటుంబాన్ని 20 సంవత్సరాలుగా రామలక్ష్మి పోషిస్తోంది. దివ్యాంగురాలు కావడంతో ఆమెకు వివాహం కాలేదు. అయినా ఆ ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచింది.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

చేస్తాం. వాట్సాప్ గ్రూపుల్లో వీటిని పోస్టు చేస్తాం. జిల్లాలో సైబర్ నేరాల కారణంగా ఇప్పటికే రూ.2 కోట్ల వరకు వేర్వేరు కేసుల్లో బాధితులు నష్టపోయారు. సైబర్ మోసం జరిగిన వెంటనే బాధితులు 1930 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

పోలీస్ స్టేషన్లలో ఫ్రంట్ ఆఫీసులు

ప్రతి పోలీస్ స్టేషన్‌లో వివిధ సమస్యలపై వచ్చే వారి నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ఫ్రంట్ ఆఫీసులు నిర్వహించాలని ఆదేశించాం. స్టేషన్‌కు అందుతున్న ప్రతి ఫిర్యాదుకు జవాబుదారీ తనం ఉండేలా చర్యలు చేపట్టాం. సివిల్ కేసుల్లో పోలీసులు తలదూర్చకుండా ఫిర్యాదులను చట్ట పరిధిలో మాత్రమే పరిశీలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ప్రతి స్టేషన్ పరిధిలో రెండు నైట్ బీట్ బృందాలు పని చేస్తున్నాయి. గ్రామాల్లో మద్యం బెల్ట్ దుకాణాలు, దాబాలు, ఆరుబయట మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాం. 24 బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, బ్లింకింగ్ లైట్‌లను ఏర్పాటు చేయాలని హైవే అథారిటీ అధికారులను కోరాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుంది. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం.

స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

... 5వ పేజీ తరువాయి

కలుపుతుంటే, మరికొందరు ఆవు, పంది కొవ్వులు కలిపి నెయ్యి సరఫరా చేస్తున్నారు. స్వీటు షాపుల వారికి వ్యాపారమే ప్రధానం కాబట్టి ఇవన్నీ పట్టించుకోవడం లేదు. నగరంలోని కొన్ని స్వీటు షాపులకే ఐఎస్ఓ సర్టిఫికేషన్‌లు ఉన్నాయి. మిగిలిన వారికి వాటి గురించి అవగాహనే లేదు.

గడువు తేదీ గాలికి...

ప్యాకింగ్ చేసే ప్రతి ఆహార పదార్థానికి విక్రేతలు గడువు తేదీ వేయాలి. ఆ నిబంధనను స్వీటు షాపులు కూడా పాటించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. కొన్నాళ్లు పెద్ద పెద్ద స్వీటు షాపుల వారు ఈ నిబంధన పాటించారు. ఆ తరువాత గాలికి వదిలేశారు. ఇప్పుడు ఏ షాపులోను ఈ బోర్డులు కనిపించడం లేదు. వాస్తవానికి స్వచ్ఛమైన నెయ్యితో తయారైన స్వీట్లు మెత్తగా ఉండి ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. కల్తీ నెయ్యితో తయారుచేసినవి ఒక్కరోజులోనే ఎండిపోయి రుచిని కోల్పోతాయి. నగరంలో చాలా స్వీటు షాపుల్లో కల్తీ నెయ్యినే వాడుతున్నారు.

నెయ్యిలో ఏమి కలుపుతారంటే..?

నెయ్యిని తక్కువ ధరకు అమ్మడానికి అందులో డాల్డా, పామాయిల్, జంతువుల కొవ్వు కలుపుతారు. కొన్నిసార్లు రిఫైన్డ్ నూనెలు, రసాయనాలు, కలర్ కోసం రంగులు, నిల్వ చేయడానికి అవసరమైన ప్రిజర్వేటివ్‌లు కలుపుతారు.

ఎలా గుర్తించాలంటే...

కల్తీ నెయ్యి రంగు వేరుగా ఉంటుంది. చూడగానే తెలిసిపోతుంది. దీనికి రుచి, వాసన ఉండవు. సీసాలో పైన ఆయిల్ తేలుతూ కిందన పదార్థంలా పేరుకుపోతుంది. వేడి చేస్తే పూర్తిగా కరగదు. కొంత అలాగే ఉండిపోతుంది.

కల్తీ నెయ్యితో నష్టాలు

● అజీర్ణ సమస్యలు ● అలర్జీ ● రంగు కలపడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

ప్రాంతీయ లేబొరేటరీకి ఎన్ఏబీఎల్ గుర్తింపు లేదు

- జీవీ అప్పారావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, డివిజన్-3

విశాఖ చినవాల్తేరులోని ప్రభుత్వ ప్రాంతీయ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీకి ఎన్ఏబీఎల్ గుర్తింపు లేదు. గుర్తింపు ఉన్న లేబొరేటరీలోనే ఆహార పదార్థాలు కల్తీ జరిగిందా?, లేదా? అనేది పరీక్షించుకోవాలి. చినవాల్తేరు లేబొరేటరీకి కేవలం నీటిని పరీక్షించే యంత్రాలే ఉన్నాయి. ఆహార పదార్థాలకు వారు ఇచ్చే సర్టిఫికెట్లు చెల్లవు. సింహాచలం దేవస్థానం అక్కడి నుంచి ఎటువంటి సర్టిఫికెట్లు తీసుకున్నా అవి పరిగణనలోకి రావు.


రాంబిల్లి మండలం వాడనర్సాపురం తీరంలో...


ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్రతీరంలో...


నక్కపల్లి మండలం రాజయ్యపేట తీరంలో...

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి తీరతాం

▸▸ అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ప్రతిన

రాంబిల్లి, సెప్టెంబరు 21: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని వాడనర్సాపురం తీరం వద్ద ఇన్‌కాయిస్, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖాధికారి పి.ప్రసాద్, ఫిషరీష్ ఏడీఎఫ్ షేక్ జాస్మిన్, రాంబిల్లి సీఐ నర్సింగరావుతో పాటు పలు శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై తీరంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. తీర ప్రాంతాల పరిశుభ్రత, పరిరక్షణ అందరి బాధ్యతగా జిల్లా మత్స్యశాఖాధికారి ప్రసాద్ పేర్కొన్నారు. సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సుకూర్ షేక్, ఎస్‌వైకే కో-ఆర్డినేటర్ జి.మహేష్, రాష్ట్ర మత్స్యకార విభాగం అధికార ప్రతినిధి చెల్లూరి దేముడు, బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు, మాజీ ఎంపీటీసీ కొవిరి సోమేష్, కో-ఆప్షన్ సభ్యుడు చింతకాయల పెంటయ్య పాల్గొన్నారు.

అచ్యుతాపురం: సాగర గర్భంలో ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలు చేరడం వల్ల జల కాలుష్యం ఏర్పడి మత్స్య సంపద నశిస్తుందని ఇన్‌కాయిస్ సంస్థ ప్రతినిధి, శాస్త్రవేత్త కిప్పులి రాజేష్ అన్నారు. పూడిమడక తీరంలో నిర్వహించిన స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ కార్యక్రమంలో మాట్లాడారు. ఇప్పటికే తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కర్మాగారాల కాలుష్యం సముద్రంలో చేరి మత్స్యసందపకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. కాలుష్య రహిత సముద్రాన్ని ఏర్పాటు చేయకపోతే మానవాళి మనుగడకే ముప్పుగా పేర్కొన్నారు. పూడిమడక మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు, ఎస్ఐ పైడిరాజు, మురళీకృష్ణ, మణికంఠ, సూరాడ సత్తిబాబు, ప్రవీణ్ కుమార్, చేపల వేకంకటరమణ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో స్వచ్ఛ సాగర్- సురక్ష సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌కాయిస్ సంస్థ ప్రతినిధి డాక్టర్ కొత్త శ్రీనివాస్, మెరైన్ సీఐ బి.నారీమణి మాట్లాడుతూ సముద్ర తీరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతకుముందు వీరు పాఠశాల విద్యార్థులతో కలిసి తీర ప్రాంతంలో ఉన్న చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. మెరైన్ ఎస్ఐ ఎం.కృష్ణ, సర్పంచ్ లోవరాజు, మత్స్యకార సంక్షేమ సమితి సభ్యుడు సిహెచ్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్ శ్రమదానం చేశారు. రాజయ్యపేట సముద్రతీరంలో స్వచ్ఛ సాగర్ కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్పీటీసీ కాసులమ్మ, సర్పంచ్ అప్పలనర్స, ఎంపీటీసీ సత్తియ్య కూటమి నాయకులు పాల్గొన్నారు. పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ నేతృత్వంలో ఉపాధ్యాయులు ఆచార్యులు, ఫల్గుణరావు, కుమారి తదితరులు శ్రమదానం చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత హీ సేవ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 : జిల్లాలోని పలుచోట్ల శనివారం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని పలు విభాగాలు, ఆవరణలోనూ వైద్యులు, స్టాఫ్‌నర్సులు చీపుర్లు చేతబట్టి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ శ్రీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.


ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో చీపుర్లు పట్టి తుడుస్తున్న వైద్యులు, సిబ్బంది

పాయకరావుపేట రూరల్ : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపురం పీఏసీఎస్ ఆవరణలో శనివారం క్లీన్, గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ సీఈవో రామరాజు, సిబ్బంది గంటా వెంకటరావు తదితరులు పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

ఎలమంచిలి : ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంతో పాటు మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో అప్పలనాయుడు సిబ్బందితో కలిసి ఆవరణలోని చెత్తాచెదరాన్ని తొలగించారు. ఏటికొప్పాక పంచాయతీలో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంపపాలెం పాఠశాలను సందర్శించిన డీఈవో


విద్యార్థుల నోట్‌పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో

ఎలమంచిలి, సెప్టెంబరు 21 : విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు నిరంతర కృషి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచించారు. శనివారం మండలంలోని జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల చేపట్టిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ముందుగా ఉపాధ్యాయుల టీచింగ్ నోట్ పుస్తకాలను, పాఠ్య ప్రణాళికలను, డైరీలను పరిశీలించారు. హెచ్ఎం ఎ.వి.హెచ్. శాస్త్రి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది పరీక్షలకు సిద్ధం చేయాలి'

నక్కపల్లి : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ముందుగానే సంసిద్ధం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారిణి బి.శకుంతల ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గొడిచెర్ల హైస్కూల్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, ల్యాబ్, గ్రంథాలయంతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఎంఈవోలు నరేశ్, వేమగిరి నూకరాజు, హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'త్వరలో సబ్సిడీపై పాలు పితికే యంత్రాలు'


వంటషెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఆనంద్

ఎలమంచిలి, సెప్టెంబరు 21 : పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ విశేషంగా కృషి చేస్తున్నట్టు డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ తెలిపారు. మునిసిపాలిటీ పరిధి కొత్తపాలెంలో శనివారం డెయిరీ నిధులతో వంట షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి మేలు జాతి పాడి గేదెలను అందించడం జరుగుతుందన్నారు. పాలు పితికే యంత్రాలను సబ్సిడీపై త్వరలో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆడారి వెంకట్, కౌన్సిలర్ రాపేటి సంతోష్, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ధర్నా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21: ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 85కు వ్యతిరేకంగా ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నోటికి నల్లటి మాస్కులు ధరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జీవో 85ను తక్షణమే రద్దు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు ఏపీవీవీపీ వైద్యులకు ఇచ్చే అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యుడు డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

వైద్యాలయం ఎదుట కార్మికులు నిరసన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలన్నారు. ఈనెల 29వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకుంటే 30వ తేదీ నుంచి విధులను బహిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సంతోష్, అడ్డా ప్రసాద్, సుధీర్, నూకరాజు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించండి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 21 : మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు శాఖల వారీగా ప్రణాళిక రూపొందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఇన్‌చార్జి ఏఎస్‌వో రమణి అధికారులకు సూచించారు. శనివారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో స్వర్ణాంధ్ర 2047పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు.

విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



నక్కపల్లి, సెప్టెంబరు 21 : ఇక్కడి వీవర్స్ కాలనీలో ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తికి వేద పండితులు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కస్పావీధిలో లక్ష్మీగణపతి హోమం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 : కస్పావీధిలో లక్ష్మీగణపతి వినాయక మహోత్సవంలో భాగంగా శనివారం స్వామివారి మండపం వద్ద హోమాన్ని జరిపారు. మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజిబాబు, శ్రీదేవి, కోటిపల్లి శ్రీను, సంతోష్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, రీసు అప్పలాచారి, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఆహ్వానపు నాటకోత్సవాలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో వచ్చే నెల మూడు నుంచి ఏడో తేదీ వరకు కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటకోత్సవాలు నిర్వహించనున్నామని కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు శనివారం తెలిపారు. ప్రతి రోజూ రెండు నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు. మాజీ కౌన్సిలర్ కె.ఎం.నాయుడు, మళ్ల సూరిబాబు, దేవాదుల శివాజీ తదితరుల పర్యవేక్షణలో ఈ నాటిక పోటీలు జరుగుతాయని వివరించారు.

దేశపాత్రునిపాలెంలో చేతి పంపు ప్రారంభం

పరవాడ, సెప్టెంబరు 21 : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో ఏర్పాటు చేసిన చేతిపంపును కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మచ్చ శివకుమార్, పిళ్లా శివకృష్ణ, కరణం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు 35మంది హాజరు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 : ఎన్టీఆర్ భరోసా పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం సదరం క్యాంపు నిర్వహించారు. నాతవరం, గొలుగొండ మండలాల నుంచి 35 మంది హాజరుకాగా, వీరిలో 21 మంది పింఛన్‌కు అర్హులుగా గుర్తించామని వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గంగాధర్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట ఎస్ఐగా పురుషోత్తం



పాయకరావుపేట, సెప్టెంబరు 21 : ఇక్కడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జె.పురుషోత్తం నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విశాఖపట్నం వన్ టౌన్ ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై విచ్చేశారు.

ఎలమంచిలిలో యూరియా కొరత

ఎలమంచిలి, సెప్టెంబరు 21 : పట్టణంలో మూడు రోజులుగా యూరియా కొరత ఏర్పడింది. దీంతో పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో ఖరీఫ్ పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. అయితే సకాలంలో యూరియా దొరక్కపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. శనివారం పట్టణంలోని మన గ్రోమోర్ దుకాణం వద్దకు యూరియా కొనుగోలుకు వచ్చామని, స్టాక్ లేదని దుకాణం ప్రతినిధి తెలిపారని కొందరు రైతులు తెలిపారు. గత్యంతరం లేక బ్లాక్‌లో యూరియాను కొంటున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే కేంద్రాల్లో రూ.250కి విక్రయిస్తుంటే, బ్లాక్‌లో రూ.350కు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి మోహన్‌రావు వద్ద ప్రస్తావించగా, రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'వైసీపీ పాలనలో టీటీడీలో అవకతవకలపై విచారణ చేపట్టాలి'

తుమ్మపాల, సెప్టెంబర్లు 21 : వైసీపీ ఐదేళ్ల పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడి పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి అండ్ కో టీటీడీని భ్రష్టు పట్టించారన్నారు. అలాగే లడ్డూ ప్రసాదంపై జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కుప్పిలి జగన్, బోడి వెంకటరావు, గుడాల సత్యనారాయణ, మళ్ల శివన్నారాయణ, భర్నికాన శ్రీనివాసరావు, కోడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి వినాయకుడ్ని దర్శించుకున్న 'పంచకర్ల'

సబ్బవరం, సెప్టెంబరు 21 : తవ్వవానిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామివారిని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శనివారం దర్శించుకున్నారు. అనంతరం పారిశ్రామికవేత్త, జనసేన నాయకులు బోకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. సర్పంచ్ స్వామి నాయుడు, మాజీ సర్పంచ్ బోకం అప్పల నాయుడు, శ్రీనివాస్, కూటమి నాయకులు బోకం బాలకృష్ణ, గండి ముత్యాల నాయుడు, బలిరెడ్డి అప్పారావు, కర్రి కనక రాజు, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, శింగంపల్లి శ్రీను, కేవీ సత్యనారాయణ, అండిబోయిన బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

కశింకోట, సెప్టెంబరు 21 : మండలంలోని నర్సింగబిల్లిలో శనివారం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడింది. ఈ ఘటనలో రెండు పాడి గేదెలు మృతిచెందగా, ఆ భీకర శబ్దానికి పొలంలో పనిచేస్తున్న మహిళ ఒక్కసారిగా కింద పడిపోవడంతో ముక్కుకు తీవ్ర గాయమైంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. చింతలపాలెం గ్రామానికి చెందిన బుదిరెడ్డి దుర్గునాయుడు, అతని భార్య జయ మధ్యాహ్నం పంట పొలంలో పనిచేస్తున్నారు. ఇంతలో భారీ వర్షంతో ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో వీరికి చెందిన గేదెతో పాటు ర్యాలి చినబ్బాయి అనే రైతుకు చెందిన గేదె అక్కడికక్కడే మృతి చెందాయి. పిడుగు శబ్దానికి పొలంలో ఉన్న జయ ఒక్కసారిగా ఉలిక్కిపడి కిందపడిపోయింది. ఆమె ముక్కుకు తీవ్ర గాయం కావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్ఐ రమేష్, వీఆర్వో రాంబాబు, పశువైద్య సిబ్బంది పరిస్థితి పరిశీలించారు.



గురజాడ అప్పారావుకు ఘన నివాళి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 21 : సాహితీ సంస్కర్త గురజాడ వెంకట అప్పారావు జయంతిని శనివారం ఆయన జన్మస్థలమైన ఎస్‌రాయవరంలో ఘనంగా నిర్వహించారు. గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు గురజాడ రచనలతో పాటు ఆయన గొప్పతనాన్ని కీర్తించారు. అనంతరం ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురజాడ ఫౌండేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కందుల వెంకటేశ్వరరావు, కొణతాల శ్రీనివాసరావు, లక్కోజు ఆదిమూర్తి, పడమటి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురజాడ జయంతిని జరిపారు. ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నిర్వహించిన కవిత, సాహిత్యం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కొత్తూరు : గురజాడ జయంతిని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామా కాలనీలో గల జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మళ్ల బాపునాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరవాడ : ఇక్కడి ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురుజాడ జయంతిని జరిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మూఢ నమ్మకాలపై అలుపెరగని పోరా టం చేసిన ఘనత గురజాడకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గురజాడ అప్పారావు జయంతి స్థానిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, హెచ్ఎం ప్రభావతి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, రామలక్ష్మి, వెంకట్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్.రాయవరంలో గురజాడ జయంతిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

కొలిక్కివచ్చిన రెవెన్యూ బదిలీలు?

... 5వ పేజీ తరువాయి

బదిలీలు పూర్తిచేయాలని నిర్ణయించుకున్న మూడు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే సమావేశమై చర్చించుకున్నారు. ఎవరిని ఏజెన్సీకి పంపాలి?, ఎవరిని కొండ పైనుంచి మైదానానికి తీసుకురావాలనే జాబితా రూపొందించుకున్నారని తెలిసింది. శనివారం బదిలీ చేస్తే రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నందున ఆదివారం సాయంత్రం లోగా జాబితా వెలువరిస్తే సరిపోతుందని అంచనాకు వచ్చారంటున్నారు. కాగా జిల్లా పరిషత్, జల వనరులు, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఇతర శాఖల్లో బదిలీలకు సంబంధించి కూడా కసరత్తు పూర్తయ్యింది. ఆయా శాఖల అధికారులు జాబితాలకు కలెక్టర్ ఆమోదం తీసుకునే పనిలో ఉన్నారు. వాటిని కూడా ఆదివారం విడుదల చేసే అవకాశం ఉంది.


24 నుంచి 'పొలం పిలుస్తోంది'



'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 21 : ఈ నెల 24 నుంచి వ్యవసాయ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తుంది' పోస్టర్‌ను శనివారం ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. రైతులకు అత్యాధునిక సాగు పద్ధతులు, కోత విధానాలు తెలియజేసి సాగు వ్యయాన్ని తగ్గించే లక్ష్యంగా పొలం పిలుస్తుంది జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు తెలిపారు. ప్రతి మంగళ, బుధ వారాలల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు గ్రామాల్లో క్షేత్ర పర్యటనలు చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, ఏడీ శ్రీదేవి పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రం ప్రారంభం



రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు తదితరులు

మాడుగుల, సెప్టెంబరు 21 : మాడుగుల కేంద్రం కొబ్బరితోట వీధిలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాన్ని శనివారం మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. దీన్ని రూ.23 లక్షల 90 వేల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాడుగులలో ప్రజలతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అదేవిధంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా టూరిజం హబ్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని విలేఖరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, మండల అధ్యక్షులు అద్దెపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేముడు, పట్టణ అధ్యక్షులు వడ్డాది రంజిత్‌వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలతో తెగుళ్ల నివారణ



బ్రహ్మాస్త్ర కషాయం తయారు చేస్తున్న రైతులు

గొలుగొండ, సెప్టెంబరు 21 : ప్రకృతి వ్యవసాయ సాగుపద్ధతులపై చేపట్టాల్సిన బ్రహ్మాస్త్రం కషాయం తయారు చేసుకుని ఖరీఫ్ వరిసాగుపై పూయాలని రైతులకు వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని కొత్తఎల్లవరంలో శనివారం ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వేప, కానుగ, జామ, బొప్పాయి, సీతాఫలం ఆకులతో కషాయం తయారు చేయించారు. వరిపైరుకు వచ్చే రసంపీల్చు పురుగు, పచ్చ పురుగు, గొంగళి పురుగుల నివారణకు ఈ కషాయం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కషాయం ఎకరా వరిపైరుకు 3 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలుపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజనల్ ఎంటీ శివకుమార్, పార్వతి, ఎర్రయ్యమ్మ, శాంతి కుమారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

76 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు

కె.కోటపాడు, సెప్టెంబరు 21 : కె.కోటపాడు మండలం ఆనందపురం జంక్షన్ వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నటు ఏ.కోడూరు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. వారి నుంచి 76 కిలోల గంజాయి, ఒక ఆటో, మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమం.. 'ఇది మంచి ప్రభుత్వం'

చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



టీడీపీ అభిమాని గోవింద రూపొందించిన హనుమాన్ విగ్రహాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే రాజు



ముకుందపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

రావికమతం, సెప్టెంబరు 21 : తీవ్ర ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధిని సమతౌల్యంగా భావించి పాలన సాగిస్తున్న ప్రభుత్వం తమదని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. 'ఇది మంచిప్రభుత్వం'లో భాగంగా శనివారం కొత్తకోట పంచాయతీలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఎన్నిక ల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడం జరుగుతుందన్నారు. అందులో కొన్ని ఇప్పటికే అమలు చేయడం జరిగిందన్నారు.బీఎన్ రోడ్డుకు రూ.70 లక్షలతో మరమ్మతులు, కొత్తకోటలో 30 పడకల ఆస్పత్రి, కల్యాణ మండప నిర్మాణం వంటివి చేస్తామన్నారు.టీడీపీ సీనియర్ నేత కోట గోవిందరావు మరికొన్ని సమస్యలను తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. టీడీపీ వీరాభిమాని గట్టా గోవిందరాజుతో రూపొందించిన హనుమాన్ విగ్రహాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు.

కలుషిత నీరు సరఫరాపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ఆరు నెలలుగా కొళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తున్నారంటూ కొత్తకోట మిలట్రీ నగర్ కాలనీకి చెందిన మహిళల ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే రాజు అక్కడే ఉన్న ఎంపీడీవో వెంకన్నబాబును ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరావు, తెలుగుమహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కోట నీలవేణి, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు కోన లోవరాజు, పందల దేవ, ఎంపీటీసీ పూడి దేవా, టీడీపీ నా యకులు కోటసత్యనారాయణ, యు.శ్రీను పాల్గొన్నారు.

మాడుగులలో ఎమ్మెల్యే 'బండారు'

మాడుగుల రూరల్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా ఆయన పోతన పూడి అగ్రహారం, ముకుందపురం, వంటర్లపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందించనున్న సూపర్ సిక్స్ పలు సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, మండల పార్టీ అధ్యక్షులు అద్దెపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, పుప్పాల అప్పలరాజు, రమేశ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ, నందారపు సన్యాసిరావు, మాలిబాబు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై మేలు జాతి పశువులు : ఎమ్మెల్యే రాజు



పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం, సెప్టెంబరు 21 : తమ ప్రభుత్వం ద్వారా రానున్న ఐదేళ్లల్లో రైతులకు మేలు జాతి పశువులను రాయితీపై అందించనున్నదని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని టి.అర్జాపురంలో శనివారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీ టి.పుష్ప, పశు వైద్యాధికారులు సురేష్, ప్రతాప్, హరిప్రియ, బాలతేజ, జాహ్నవి, టీడీపీ మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, గ్రామ సర్పంచ్ మడగల పాల్గుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో 'స్వచ్ఛతా హీ సేవ'



నర్సీపట్నం : చీపురు పట్టి బూజు దులుపుతున్న ఆర్డీవో జయరాం



చీడికాడ : ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చెత్త తొలగిస్తున్న అధికారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 21 : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో జయరాం చీపురుతో గోడల బూజులు దులుపి శుభ్రం చేశారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిసరాలు, లోపల భూజులు దులిపారు. ఉద్యోగులు, కింది స్థాయి సిబ్బంది కార్యాలయం ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, లింగంపేట, చోద్యం, నాగాపురం, పాత కృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తాచెదారాలు, తుప్పలు తొలగించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లో సుజాత, పంచాయతీ కార్యదర్శు రాజేష్, శ్రీను, అప్పారావు, వైద్య, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఈ క్రమంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, తహసీల్దార్ కార్యాయలంలో తహసీల్దార్ ప్రసాద్‌రావు, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో చిరంజీవి, ఉపాధి కార్యాలయంలో ఏపీవో వరలక్ష్మి తమ కార్యాయాలల్లో చెత్త, తుప్పలను శుభ్రపరిచారు.

నాతవరం : మండలకేంద్రంలో శనివారం స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పిచ్చితుప్పలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఎంఈవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవో కె.వరహాలబాబు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా పరిసరాల్లో ఉన్న చెత్తాను తొలగించారు.

చీడికాడ : ప్రభుత్వ,పంచాయతీ కార్యాలయాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీడీవో జయప్రకాశరావు అన్నారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీడీవోతో పాటు ఇతర సిబ్బంది కార్యాలయం లోపల, బయట పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కామేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : స్వచ్ఛతా హీ పక్షోత్సవాలలో భాగంగా శనివారం వడ్డాది కేజీబీవీలో విద్యార్థినులు శ్రమదానం చేశారు. స్కూల్ భవనాలు, పరిసరాలను పరిశుభ్ర పరిచారు. అలాగే ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, హైస్కూల్స్‌లో స్వచ్ఛతా హీ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వడ్డాది విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 21 : రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 19న అనకాపల్లి జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా అండర్-14 స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో బాలికల విభాగంలో 30 కిలోల నుంచి దాసరి రోహిణి, బాలుర విభాగం 40 కిలోల విభాగం నుంచి గోడ చరణ్, 28 కిలోల విభాగం నుంచి పాంగి రిషిలు ఎంపికైనట్టు హెచ్‌ఎం శేషుబాబు, పీఈటీ నర్సింగరావు తెలిపారు. ఈ నెల 23, 24వ తేదీల్లో తిరుపతి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ విద్యార్థులను స్కూలు అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోవెల వెంకటరమణ, శేషుబాబు, నర్సింగరావులు అభినందించారు.

ఎంకేపట్నం-కొరుప్రోలు రోడ్డు నిర్మాణానికి సర్వే



సర్వే చేస్తున్న పీఆర్ (ప్రాజెక్టు) ఏఈఈ శ్రీనివాసరావు తదితరులు

రోలుగుంట, సెప్టెంబరు 21 : మండలంలోని ఎంకేపట్నం పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన కొరుప్రోలుకు రోడ్డు నిర్మాణానికి శనివారం పీఆర్ (ప్రాజెక్టు)ఏఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం సర్వే చేపట్టారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ పించన్ తీసుకోవడానికి డోలిమోతపై వెళ్లి గత నెల 2న నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. దీంతో అప్పట్లోనే జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రాథమిక సర్వే చేపట్టారు. మరో మారు శనివారం సిబ్బందిలో కలిసి సమగ్ర సర్వే చేపట్టారు. ఎంకేపట్నం నుంచి కొరుప్రోలుకు ఎటువంటి రోడ్డు నిర్మాణం అనువుగా ఉంటుందో పరిశీలించారు. సుమారు మూడు కిలోమీటర్లు మేర నిర్మించే ఈ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.1.50 కోట్లు నిధులు అవసరం అవుతుందన్నారు. ఈ మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంలో ఎంత మేరకు తుప్పలు, రాళ్ల, తొలగించాలనేది అంచనా వేసినట్లు తెలిపారు. సర్వే నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

బడి ఆటోలో పరిమితికి మించి పిల్లలు.. త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆటో డ్రైవర్‌ని నిలదీస్తున్న స్థానికులు

నర్సీపట్నం, సెప్టెంబరు 21 : ఆటోలో స్కూలుకు బయలు దేరిన విద్యార్థికి త్రుటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం ఆటో ఒకటి విద్యార్థులను ఎక్కించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైపు నుంచి నర్సీపట్నం బయలుదేరింది. మార్కెట్ దగ్గర ఆటోలో వెనక భాగంలో కుర్చున్న విద్యార్థి కూరగాయల మార్కెట్ వద్ద జారి పడిపోయాడు.ఈ విషయం గమనించకుండా డ్రైవర్ ఆటో ముందుకు పోతుండగా, మార్కెట్లో జనం పెద్ద పెట్టున కేకలు వేయడంతో ఆటో ఆపాడు. అక్కడ ఉన్న వారంతా 'చిన్న పిల్లాడు పడిపోతే గమనించకుండా ఆటో పోనిస్తావా..?' అంటూ డ్రైవర్‌ను నిలదీశారు. విద్యార్థి జారి పడిపోయిన సమయానికి వెనుక వాహనాలు ఏవీ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆటోలో పరిమితికి మించి పిల్లలు ఉండటంతో కూర్చోడానికి అవకాశం లేని పరిస్థితిలో ఆ పిల్లాడు పడిపోయాడని అక్కడి వార తెలిపారు. ఆ సమయంలో ఆటోలో సుమారు 25 మంది వరకు ఉన్నారని స్థానికులు తెలిపారు. తల్లిదండ్రులు, పోలీసులు స్కూల్ ఆటోలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

... 5వ పేజీ తరువాయి

కలుపుతుంటే, మరికొందరు ఆవు, పంది కొవ్వులు కలిపి నెయ్యి సరఫరా చేస్తున్నారు. స్వీటు షాపుల వారికి వ్యాపారమే ప్రధానం కాబట్టి ఇవన్నీ పట్టించుకోవడం లేదు. నగరంలోని కొన్ని స్వీటు షాపులకే ఐఎస్ఓ సర్టిఫికేషన్లు ఉన్నాయి.మిగిలిన వారికి వాటి గురించి అవగాహనే లేదు.

గడువు తేదీ గాలికి...

ప్యాకింగ్ చేసే ప్రతి ఆహార పదార్థానికి విక్రేతలు గడువు తేదీ వేయాలి. ఆ నిబంధనను స్వీటు షాపులు కూడా పాటించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. కొన్నాళ్లు పెద్ద పెద్ద స్వీటు షాపుల వారు ఈ నిబంధన పాటించారు. ఆ తరువాత గాలికి వదిలేశారు. ఇప్పుడు ఏ షాపులోను ఈ బోర్డులు కనిపించడం లేదు. వాస్తవానికి స్వచ్ఛమైన నెయ్యితో తయారైన స్వీట్లు మెత్తగా ఉండి ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. కల్తీ నెయ్యితో తయారుచేసినవి ఒక్కరోజులోనే ఎండిపోయి రుచిని కోల్పోతాయి. నగరంలో చాలా స్వీటు షాపుల్లో కల్తీ నెయ్యినే వాడుతున్నారు.

నెయ్యిలో ఏమి కలుపుతారంటే..?

నెయ్యిని తక్కువ ధరకు అమ్మడానికి అందులో డాల్డా, పామాయిల్, జంతువుల కొవ్వు కలుపుతారు. కొన్నిసార్లు రిఫైన్డ్ నూనెలు, రసాయనాలు, కలర్ కోసం రంగులు, నిల్వ చేయడానికి అవసరమైన ప్రిజర్వేటివ్‌లు కలుపుతారు.

ఎలా గుర్తించాలంటే...

కల్తీ నెయ్యి రంగు వేరుగా ఉంటుంది. చూడగానే తెలిసిపోతుంది. దీనికి రుచి, వాసన ఉండవు. సీసాలో పైన ఆయిల్ తేలుతూ కిందన పదార్థంలా పేరుకుపోతుంది. వేడి చేస్తే పూర్తిగా కరగదు. కొంత అలాగే ఉండిపోతుంది.

కల్తీ నెయ్యితో నష్టాలు

- అజీర్ణ సమస్యలు
- అలర్జీ
- రంగు కలపడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

ప్రాంతీయ లేబొరేటరీకి ఎన్ఏబీఎల్ గుర్తింపు లేదు

- జీవీ అప్పారావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, డివిజన్-3

విశాఖ చినవాల్తేరులోని ప్రభుత్వ ప్రాంతీయ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీకి ఎన్ఏబీఎల్ గుర్తింపు లేదు. గుర్తింపు ఉన్న లేబొరేటరీలోనే ఆహార పదార్థాలు కల్తీ జరిగిందా?, లేదా? అనేది పరీక్షించుకోవాలి. చినవాల్తేరు లేబొరేటరీకి కేవలం నీటిని పరీక్షించే యంత్రాలే ఉన్నాయి. ఆహార పదార్థాలకు వారు ఇచ్చే సర్టిఫికెట్లు చెల్లవు. సింహాచలం దేవస్థానం అక్కడి నుంచి ఎటువంటి సర్టిఫికెట్లు తీసుకున్నా అవి పరిగణనలోకి రావు.

ఆ ఇంటి మహాలక్ష్మి

... 5వ పేజీ తరువాయి

కుటుంబ భారం రామలక్ష్మిపై పడింది. సోదరి మణికి వివాహం చేసింది. సోదరికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆ తరువాత సోదరి భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో పిల్లలతో సహా పుట్టింటికి చేరింది. సోదరి కుటుంబానికి కూడా రామలక్ష్మి ఆసరాగా నిలిచింది. అందరినీ అన్నా అని ఆప్యాయంగా పిలిచే రామలక్ష్మి అంటే గ్రామస్థులకు ఎంతో అభిమానం. రోజువారీ సంపాదనతో కుటుంబాన్ని 20 ఏళ్లుగా రామలక్ష్మి పోషిస్తోంది. దివ్యాంగురాలు కావడంతో ఆమెకు వివాహంకాలేదు. అయినాఆ ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచింది.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

చేస్తాం. వాట్సాప్ గ్రూపుల్లో వీటిని పోస్టు చేస్తాం. జిల్లాలో సైబర్ నేరాల కారణంగా ఇప్పటికే రూ.2 కోట్ల వరకు వేర్వేరు కేసుల్లో బాధితులు నష్టపోయారు. సైబర్ మోసం జరిగిన వెంటనే బాధితులు 1930 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

పోలీస్ స్టేషన్లలో ఫ్రంట్ ఆఫీసులు

ప్రతి పోలీస్ స్టేషన్‌లో వివిధ సమస్యలపై వచ్చే వారి నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ఫ్రంట్ ఆఫీసులు నిర్వహించాలని ఆదేశించాం. స్టేషన్‌కు అందుతున్న ప్రతి ఫిర్యాదుకు జవాబుదారీ తనంఉండేలా చర్యలు చేపట్టాం. సివిల్ కేసుల్లో పోలీసులు తలదూర్చకుండా ఫిర్యాదులను చట్ట పరిధిలో మాత్రమే పరిశీలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ప్రతి స్టేషన్ పరిధిలో రెండు నైట్ బీట్ బృందాలు పని చేస్తున్నాయి. గ్రామాల్లో మద్యం బెల్ట్ దుకాణాలు, దాబాలు, ఆరు బయట మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాం. 24 బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, బ్లింకింగ్ లైట్‌లను ఏర్పాటు చేయాలని హైవే అథారిటీ అధికారులను కోరాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుంది. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం.

☛ సంక్షిప్తంగా..

స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో లక్ష్మీగణపతి హోమం



విఘ్నేశ్వరాలయంలో లక్ష్మీగణపతి హోమం

చోడవరం, సెప్టెంబరు 21 : బహుళ చవితి సంకటహర చతుర్థి సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రముఖ స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో ఘనంగా సామూహిక లక్ష్మీగణపతి హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ, అర్చకులు కొడమంచిలి చలపతి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షి ఆలయంలో కుంకుమ పూజలు

విశ్వకర్మ ఉత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని కామాక్షీదేవి ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక పెదబజారువీధిలోని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



పురుడు పోసి బిడ్డను అప్పగిస్తున్న 108 సిబ్బంది

మాకవరపాలెం, సెప్టెంబరు 21 : మండలంలోని ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన మహిళ 108లో ప్రసవమై ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఎరకన్నపాలేనికి చెందిన ఎన్.సత్యవతి గర్భవతి. శుక్రవారం అర్థరాత్రి పురిటినొప్పులు రావడంతో 108కి కాల్ చేశారు. మాకవరపాలెంలో ఉన్న 108 వాహనం ఎరకన్నపాలెంలో సత్యవతిని ఎక్కించుకొని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి బయలుదేరింది. రామన్నపాలెం వచ్చేసరికే పురిటి నొప్పులు మరింత ఎక్కువ కావడం తో వాహనంలోనే సిబ్బంది ప్రసవం చేయించారు. దీంతో ఆమె శనివారం రాత్రి 2.30 గంటలకు ఆడ బిడ్డకు జన్మనిచ్చినట్లు 108 సిబ్బంది భారతి, రామకృష్ణ తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వారు తెలిపారు.

సందడిగా వినాయక నిమజ్జనాలు



నిమజ్జనం కోసం తీసుకెళుతున్న ఓ వినాయక విగ్రహం

మాడుగుల/దేవరాపల్లి, సెప్టెంబరు 21 : మండల కేంద్రంలోని బస్టాండ్, మోద మాంబ కాలనీతో పాటు పలు వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం మండపాల నిర్వాహకులు నిమజ్జనం చేపట్టారు. భారీ విద్యుత్ అలంకరణ, సెట్టింగులతో వినాయకుడిని అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించి, స్థానిక మోదకొండమ్మ ఆలయ సమీపం లోని చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో మాడుగులలో సందడి నెలకొంది. ఏకొత్తపల్లి రామాలయ సెంటర్‌లో ఎస్వీఎన్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడ్ని మాజీ ఉపముఖ్య మంత్రి బూడిముత్యాలనాయుడు శనివారం దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ, సరువునాయుడు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 21 : బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కర్రి రామకృష్ణ కోరారు. ఆయన శనివారం బుచ్చెయ్యపేటలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సభ్యత్వ నమోదు కీలకమన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి అన్ని వర్గాల సభ్యత్వాలను స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇబ్రహీం బాషా, సీతా నాగరాజు, కోన వేముకుమార్, ముక్కా దేముడు, సర్పంచ్ సుంకర లక్ష్మి, శానాపతి శ్రీను పాల్గొన్నారు.

10 లీటర్ల సారాతో మహిళ అరెస్టు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 21 : ఓ మహిళను పది లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ టి.దివ్య తెలిపారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన పాంగి సత్యవతి (39) గ్రామశివారులో సారా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె వద్ద ప్లాస్టిక్ బాటిళ్లల్లో పదిలీటర్ల సారా పట్టుబడినట్లు తెలిపారు. సత్యవతిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

కొలిక్కివచ్చిన రెవెన్యూ బదిలీలు?

... 5వ పేజీ తరువాయి

బదిలీలు పూర్తిచేయాలని నిర్ణయించుకున్న మూడు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే సమావేశమై చర్చించుకున్నారు. ఎవరిని ఏజెన్సీకి పంపాలి?, ఎవరిని కొండ పైనుంచి మైదానానికి తీసుకురావాలనే జాబితా రూపొందించుకున్నారని తెలిసింది. శనివారం బదిలీ చేస్తే రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నందున ఆదివారం సాయంత్రంలోగా జాబితా వెలువరిసే సరిపోతుందని అంచనాకు వచ్చారంటున్నారు. కాగా జిల్లా పరిషత్, జల వనరులు, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఇతర శాఖల్లో బదిలీలకు సంబంధించి కూడా కసరత్తు పూర్తయ్యింది. ఆయా శాఖల అధికారులు జాబితాలకు కలెక్టర్ ఆమోదం తీసుకునే పనిలో ఉన్నారు. వాటిని కూడా ఆదివారం విడుదల చేసే అవకాశం ఉంది.